క్లుప్తంగా

అంబేడ్కర్ గ్రామ కమిటీ ఎన్నిక



నూతన కమిటీ సభ్యులు

కుల్కచర్ల: చౌడాపూర్ మండలం మల్కాపూర్‌లో బుధవారం అంబేడ్కర్ నూతన గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. సంఘం నూతన అధ్యక్షుడిగా మద్దూరు చంద్రమౌళి, ఉపాధ్యక్షుడిగా వెంకటేశ్, ప్రధాన కార్యదర్శిగా దామోదర్, కోశాధికారిగా గోవర్దన్, సంయుక్త కార్యదర్శిగా లక్ష్మయ్య, సోషల్ మీడియ కోఆర్డినేటర్‌గా భానుప్రసాద్, పవన్, ప్రవీణ్‌కుమార్, సలహాదారుడిగా అశోక్‌కుమార్, తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శులు చంద్రమౌళి, దామోదర్ మాట్లాడారు. యువత చెడు వ్యసనాల బారిన పడకుండా అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అశోక్‌కుమార్, రమేష్, నర్సింలు, వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

గుడి నిర్మాణానికి భూమిపూజ



గుడి నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న అలంపల్లి మఠాధీశులు

ధారూరు: మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ సమీపంలో నూతన ఊరడమ్మా గుడి నిర్మాణానికి బుధవారం భూమి పూజ నిర్వహించారు. వికారాబాద్ పట్టణంలోని ఆలంపల్లి కెంపిన మఠాదీశులు అప్పగారు చెన బసవప్రభుస్వామి స్థలం ఎంపిక చేసి, వెంటనే అక్కడే గుడి నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ ఎల్ అశోక్‌ముదిరాజ్, సీనియర్ న్యాయవాది సంపూర్ణా ఆనంద్‌రావు, గ్రామపెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

నేడు గౌతపూర్‌లో సన్నబియ్యం పంపిణీ

తాండూరు రూరల్: తాండూరు మండలం గౌతపూర్, చెన్‌గేస్‌పూర్ గ్రామంలోని రేషన్‌దుకాణాల్లో లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ ప్రారంభించనున్నట్లు తహసీల్దార్ తారాసింగ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గురువారం ఉదయం 10:30 నిమిషాలకు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి బియ్యం పంపిణీని ప్రారంభిస్తారని తెలిపారు. దీనికి అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకాగలరని కోరారు.

ఆస్తి పన్ను చెల్లించి రాయితీ పొందండి

షాద్‌నగర్: మున్సిపాలిటీ పరిధిలో ఉన్న ఇళ్ల యజమానులు 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆస్తి పన్నును ఈ నెల 30వ తేదీ వరకు చెల్లిస్తే 5శాతం రిబేటును పొందవచ్చని మున్సిపల్ కమిషనర్ సునీత తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ.. సకాలంలో ఆస్తి పన్నులు చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రజలు సహకరించాలని కోరారు. ఇంటి పన్నులను ఆలస్యంగా చెల్లిస్తే వడ్డీ విధిస్తామని తెలిపారు. ఇంటి యజమానులు కార్యాలయానికి వచ్చి నేరుగా కాని, మున్సిపల్ ఆన్‌లైన్ యాప్ ద్వారా కాని పన్నులు చెల్లించవచ్చని తెలిపారు. ప్రభుత్వ ఇస్తున్న ఆస్తి పన్ను చెల్లింపులో రిబేటును అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

రాజీవ్ యువ వికాస్ గడువు పొడిగింపు

మొయినాబాద్‌రూరల్: నిరుద్యోగుల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాస్ పథకానికి ఈ నెల 14వ తేదీవరకు దరఖాస్తు చేసుకోవచ్చని మండల అభివృద్ధి అధికారి సంధ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నిరుద్యోగులకు స్వయం ఉపాధి కల్పించేందుకు సబ్సిడీ కింద రుణాలు ఇవ్వడానికి ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాస్ పథకానికి ప్రభుత్వం 14వ తేదీ వరకు గడువు పొడిగించిందని తెలిపారు. నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకునే ప్రతీ అభ్యర్థి ఆధార్ కార్డు, కుల, ఆదాయ పత్రం తప్పనిసరి(అన్ని కులాల వారికి), పాన్ కార్డు, ఫొటో, లబ్ధిదారుడి ఫోన్ నెంబర్ తప్పనిసరిగా ఉండాలని తెలిపారు.

చలో సెక్రటేరియేట్‌ను విజయవంతం చేయండి

షాద్‌నగర్: వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో గురువారం నిర్వహించే చలో సెక్రటేరియట్‌ను విజయవంతం చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఆకాశ్‌నాయక్ ఒక ప్రకటనలో కోరారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన భూమిని కాపాడేందుకు వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో చలో సెక్రటేరియట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

- 6నుంచి ప్రారంభం కానున్న ఉత్సవాలు
- రామస్వామి ఆలయంలో శ్రీవారి కల్యాణం
- తరలిరానున్న భక్తులు



రామస్వామి కల్యాణానికి ముస్తాబైన ఆలయం

యాలాల: శ్రీరామ నవమి సందర్భంగా మండల పరిధిలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం జుంటిపల్లి రామస్వామి కల్యాణ ఉత్సవాలకు సంబంధించి ఆలయ కమిటీ ఏర్పాట్లను ముమ్మరంగా చేస్తున్నారు. ఈ నెల 6నుంచి బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. తాండూరు డివిజన్‌లో జరిగే పెద్ద ఉత్సవాల్లో జుంటిపల్లి రామస్వామి ఒకటి. ఇందుకోసం ఆలయ కమిటీతో పాటు గ్రామస్తులు, పోలీసులు అవసరమైనా ఆయా ఏర్పాట్లలో నిమగ్నమై ఉన్నారు.

ఉత్సవాలు ఇలా..

మొదటి రోజు శనివారం (5న) ఉదయం 11.05 గంటలకు అంకురార్పణ, ధ్వజారోహణము, రాత్రి పది గంటలకు ఎదుర్కొళ్లు నిర్వహిస్తారు. 6వ తేదీన ఆదివారం ఉదయం 11.46 నిమిషాలకు శ్రీవారి కల్యాణం, రాత్రి 8.31 నిమిషాలకు విమాన రథోత్సవం, 7వ తేదీన మధ్యాహ్నం 2.35గంటలకు వసంతోత్సవము, పెరుగు బసంతము, శేషవాహన సేవ తదితర కార్యక్రమాలుంటాయని ఆలయ కమిటీ నిర్వాహకులు పేర్కొన్నారు. చివరి రోజు మంగళవారం(8న) మహాలక్ష్మీ పూజ, హరికథ కాలక్షేపం, అన్నదానం నిర్వహిస్తారు. ఈ ఉత్సవాల కోసం తాండూరు నుంచి జుంటుపల్లి వరకు ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు నడుస్తుంటాయి.

ఆలయ చరిత్ర

జుంటిపల్లి గ్రామ శివారులో గుట్టపై వెలసిన రామస్వామి ఉత్సవాలకు యాలాలతో పాటు పెద్దేముల్, బషీరాబాద్, కొడంగల్, తాండూరుతో పాటు కర్ణాటక రాష్ట్రం నుంచి భక్తులు అధిక సంఖ్యలో వస్తుంటారు. అయితే ఆలయ చరిత్ర గురించి ఇక్కడి వారు చెప్పుకునే గాథకు ఎంతో పేరు ఉంది. జుంటుపల్లి గ్రామానికి చెందిన యాదవ వంశస్తుడు వెంకటకృష్ణ ఉద్దండరావు పశువుల కాపరిగా ఉంటూ, ఇక్కడి కొండలపై నివాసముండేవాడు. జాగీర్ల పాలనలో కూడా త్రికాల పూజలు చేస్తూ ప్రజలకు సేవలు చేస్తుండేవాడు. ఒకరోజు మేడి చెట్టుకింద నిద్రిస్తుండగా, సీతారాముల వారు కలలో వచ్చి ఇక్కడ ఆలయం నిర్మించాలని ఆదేశించారని చెబుతాడు. నిద్రమేల్కొన్న వెంకటకృష్ణరావు ముఖమార్చన చేయడానికి సమీపంలోని కోనేటికి వెళ్లాడు. కోనేరులో దిగి దోసిళ్లలో నీటిని పట్టుకుంటుండగా దోసిట్లో ఒక విగ్రహం వెంకటకృష్ణరావుకి అందింది. ఇలా మూడుసార్లు నీటిని తీసుకోవడానికి యత్నించగా, మూడు విగ్రహాలు అతడి చేతిలోకి వచ్చాయి. జరిగినా విషయాన్ని తన తమ్ముడు రంగారావుకు వివరించాడు. దీంతో వారు అవి సీతారామలక్ష్మణుల విగ్రహాలుగా గుర్తించారు. అయితే అదే సమయంలో అటువైపుగా వెళ్తున్న ఒక మహర్షి మందిర నిర్మాణానికి ఆశీస్సులు ఇచ్చి అదృశ్యమయ్యాడు. వెంటనే అన్నదమ్ములిద్దరూ ఆలయ నిర్మాణానికి మహర్షి ఆశీస్సులే అండగా భావించి నిర్మాణం ప్రారంభించారు. అనుమతి లేకుండా ఆలయ నిర్మాణాన్ని ప్రారంభించిన ఉద్దండరావును అప్పటి జాగీర్దార్లు ఆయనను చెరసాలలో బంధించారు. అయితే చెరసాలలో ఉన్న ఉద్దండరావు సంకెళ్లు రామస్వామి మహిమ వల్ల ఊడిపోవడాన్ని జాగిర్దార్లు గుర్తించి ఆయనను బంధి విముక్తుడిని చేశారు. అలా అప్పటినుంచి జుంటుపల్లి రామస్వామి ఆలయ నిర్మాణానికి అవసరమైనా చర్యలను పునఃప్రారంభించి అందరి మన్ననలను ఆయన పొందాడు.

దోనే ప్రాశస్త్యం

శ్రీరాముడు జైత్రయాత్రల్లో భాగంగా ఈ దేవాలయ సమీపంలో బస చేసినట్లు పూర్వీకులు చెబుతుంటారు. ఇక్కడ బస చేసినప్పుడు సీతాదేవి స్నానమాచరించడానికి దరిదాపుల్లో ఎలాంటి నీటి సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్న విషయాన్ని శ్రీరాముడు గుర్తించాడు. ఆ సమయంలో శ్రీరాముడు తన బాణంతో అక్కడి కొండలపై ఉన్న పెద్ద బండరాయిని చీల్చాడు. దీంతో బండరాయి రెండుగా చీలిపోయి, అందులోంచి నీటి ధార బయటకు వచ్చింది. అప్పుడు అక్కడ సీతాదేవి స్నానమాచరించినట్లు ఇక్కడి వారు కథలుగా చెప్పుకుంటారు. దీనినే దోనేగా ఇక్కడి వారు పిలుస్తుంటారు. ఈ దోనేలో నీరు ఎప్పుడు ఉంటుంది. ఈ ఉత్సవాల్లో భక్తులు ఇక్కడ స్నానమాచరించడానికి వస్తుంటారు. ఈ దోనేలో స్నానమాచరిస్తే సుఖ సంతోషాలతో పాటు సంతానప్రాప్తి కలుగుతుందని భక్తుల నమ్మకం.



ఆలయంలో కొలువైన సీతారామలక్ష్మణ విగ్రహమూర్తులు

ఇబ్బందులు కలగకుండా చర్యలు



రామస్వామి కల్యాణ ఉత్సవాలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాము. ఉత్సవాలకు తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అవసరమైనా చర్యలు తీసుకుంటున్నాము. భక్తులకు తాగునీరు, ఉండటానికి వసతి, శాంతిభద్రతల కోసం పోలీసుల బందోబస్తు తదితర వాటిని ఏర్పాటు చేశాము.

– శ్యాం సుందర్‌రావు, ఆలయ చైర్మన్, జుంటిపల్లి రామస్వామి ఆలయం

బీసీలందరూ సంఘటితం కావాలి



కుల్కచర్ల: సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

కుల్కచర్ల: బీసీలందరూ సంఘటితం కావాలని గౌడ సంఘం కుల్కచర్ల మండల అధ్యక్షుడు మాలె కృష్ణయ్య గౌడ్, ప్రధాన కార్యదర్శి మహేశ్వరం రాములు పేర్కొన్నారు. బుధవారం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతిని పురస్కరించుకుని కుల్కచర్ల మండల కేంద్రంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..బీసీలందరూ ఐక్యంగా ఉండి 42శాతం రిజర్వేషన్లు సాధించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జోగు వెంకటయ్య, నారాయణ, విజయ్‌కుమార్ గౌడ్, వెంకటయ్య, అశోక్, వెంకటేష్, అమృతయ్య, పెంటయ్య, రాంచంద్రయ్య, శివకుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బొంరాస్‌పేటలో..

బొంరాస్‌పేట: మండల పరిధిలోని తుంకిమెట్లలో నిర్వహించారు. గ్రామంలో ప్రధాన కూడలిలోని పాపన్న విగ్రహానికి గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ శేరి రాజేశ్‌రెడ్డి, గౌడసంఘం నాయకులు, కాంగ్రెస్ నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. పాపన్న చేసిన పోరాటం, త్యాగాలను వారు గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సింలుగౌడ్, కోస్గి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెంకట్రాములుగౌడ్, జయకృష్ణ, మల్లేశ్, రాంచంద్రారెడ్డి, సూర్య ప్రకాశ్‌గౌడ్, బాల్‌రాజ్‌గౌడ్, నర్సింలునాయుడు, శ్యామలయ్యగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

భూముల వేలం ఆపాలి

సీపీఎం డిమాండ్



హెచ్‌సీయూ భూముల వేలం ఆపాలని నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

దుద్యాల్: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన 400 ఎకరాల భూముల వేలాన్ని రద్దు చేసుకోవాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు బుస్స చంద్రయ్య పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలో సీపీఎం నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బుస్స చంద్రయ్య మాట్లాడుతూ విద్యార్థుల చదువుల కోసం విశ్వవిద్యాలయానికి అప్పగించిన భూమిని ప్రభుత్వం తిరిగి తీసుకోవాలనుకోవడం బాధాకరమన్నారు. నగరంలో పర్యావరణాన్ని పరిరక్షించాలంటే అక్కడక్కడ ఇలాంటి చిన్నచిన్న అడవుల అవసరాన్ని ప్రతీ ఒక్కరూ గుర్తించాలన్నారు. ఈ భూములను పరిరక్షించాలని విద్యార్థులు పోరాటం చేస్తుంటే వారిపై పోలీసులు విక్షణారహితంగా దాడి చేసి అరెస్టు చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. విద్యార్థులపై ప్రభుత్వం చేస్తున్న దాడులను ఆపేయాలన్నారు. యూనివర్సిటీ భూముల వేలాన్ని వెంటనే నిలిపివేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు మల్లయ్య, పెంటప్ప, గంగమ్మ, కిష్టప్ప, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

తవ్వకాలు నిలిపివేయాలని వినతి



గుట్టప్రాంతాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ గాయత్రి, అధికారులు

సుంకరగుట్ట ప్రాంతాన్ని పరిశీలించిన తహసీల్దార్ గాయత్రి

దౌల్తాబాద్: మండల కేంద్రంలోని సుంకర్‌గుట్టను కొన్నేళ్లుగా అక్రమంగా తవ్వకాలు జరుపుతున్నారని వెంటనే నిలిపివేయాలని కోరుతూ బుధవారం గ్రామానికి చెందిన వందమంది యువకులు తహసీల్దార్ గాయత్రి, పంచాయతీ కార్యదర్శి గోపాల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మైనింగ్‌శాఖ ఇచ్చిన అనుమతులకన్నా అదనంగా తవ్వకాలు జరిపి గుట్టను రాళ్లుగా మార్చి సొమ్ము చేసుకుంటున్నారని తహసీల్దార్ దృష్టికి తెచ్చారు. నిత్యం పదుల సంఖ్యలో టిప్పర్లలో రాళ్లను నింపుకొని ఇతర ప్రాంతాలకు తరలిస్తూ అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో తహసీల్దార్ స్పందించి గుట్టప్రాంతాన్ని పరిశీలించాలని వారు కోరారు. ఈ విషయమై తహసీల్దార్ అక్కడ ఉన్న వారిని వివరాలు సేకరించగా తమకు మైనింగ్, పంచాయతీ, రెవెన్యూ నుంచి అన్ని అనుమతులు ఉన్నాయని సంబంధిత నిర్వాహకులు తహసీల్దార్‌తో చెప్పుకున్నారు. దీనికి స్పందించిన తహసీల్దార్ గాయత్రి గురువారంలోగా సంబంధిత అనుమతుల పేపర్లు తహసీల్దార్ కార్యాలయంలో చూపించుకోవాలని ఆదేశించారు. దీంతో అక్కడ గుట్టపై ఉన్న హనుమాన్‌దేవాలయాన్ని తొలగిస్తే ఆందోళన చేస్తామని గ్రామ యువకులు హెచ్చరించారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

దౌల్తాబాద్: పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని బుధవారం పంచాయతీ కార్మికులు ఎంపీడీఓ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్మికుల సంఘం మండల అధ్యక్షుడు మాట్లాడుతూ కార్మికుల వేతనాలు సకాలంలో చెల్లించాలని, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, అర్హులైన వారిని పంచాయతీ కార్యదర్శులుగా గుర్తించాలని కోరారు. కార్మికులకు ఇందిరమ్మ ఇళ్లు, ఇండ్ల స్థలాలు, అనారోగ్యానికి గురై మృతిచెందితే వారి స్థానంలో కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలన్నారు. పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్మికులు రాములు, వెంకటేష్, నారాయణ, ,కిష్టప్ప, సాయిదాసు తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్ గడువు 30 వరకు

ధారూరు: ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎల్ఆర్ఎస్ గడువు తేదీ మార్చి31 నుంచి ఏప్రిల్ 30 వరకు పొడిగించిందని ఎంపీడీఓ నర్సింహులు బుధవారం తెలిపారు. జీపీల్లో అప్రూవల్ కాని, అక్రమ ప్లాట్లకు ఎల్ఆర్ఎస్ చేసుకోవాలని, ఈ అవకాశాన్ని అందరూ వినియోగించుకోవాలనీ ఆయన కోరారు.

ముగిసిన పదోతరగతి పరీక్షలు

కొడంగల్ రూరల్: మార్చి 21వ తేదీ నుంచి ప్రారంభమైన పదోతరగతి రెగ్యులర్ పరీక్షలు బుధవారం సోషల్ సబ్జెక్టుతో ముగిశాయి. గురువారం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఒకేషనల్ పరీక్షలు జరుగనున్నాయి. బుధవారం పట్టణంలోని నాలుగు పరీక్షా కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షలకు 902మంది విద్యార్థులకు 896మంది హాజరయ్యారని ఎంఈఓ రాంరెడ్డి తెలిపారు.

బీజేపీ కోసం పని చేయండి

జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కె రాజశేఖర్‌రెడ్డి



రాజశేఖర్‌రెడ్డికి సన్మానం చేస్తున్న రామేశ్వర్ రెడ్డి

మర్పల్లి: ప్రతీ కార్యకర్త బీజేపీ కోసం పని చేయాలని జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కె రాజశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు వచ్చినా బీజేపీ బలపరిచిన వ్యక్తులను గెలిపించాలని ఆయన కోరారు. బుధవారం మండల పరిధిలోని సిరిపూరం, కోట్‌మర్పల్లి గ్రామాల్లో లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో నిర్వహిస్తున్న అభివృద్ధి పనులు కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధులతోనే చేపడుతున్నారన్నారు. కేంద్రపథకాలను ప్రతీ ఇంటికి చేరేవిధంగా పార్టీ నాయకులు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో మండల నాయకుడు రాజశేఖర్ రెడ్డిని శాలువా కప్పి ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రామేశ్వర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే కాంగ్రెస్ ధ్యేయం



తాండూరు రూరల్: ఉద్దాండపూర్‌లో సీసీరోడ్డు పనులు ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు



దౌల్తాబాద్: సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

తాండూరు రూరల్: గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి పనిచేస్తున్నారని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. బుధవారం ఉద్దాండపూర్ గ్రామంలో రూ.10లక్షలతో సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ..ఉద్దాండపూర్ గ్రామాన్ని గత పాలకులు పట్టించుకోకపోవడంతో అభివృద్ధికి నోచుకోలేదన్నారు. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి కృషితో ఉద్దాండపూర్‌లో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నాగ ప్రసాద్, నాయకులు గౌసోద్దీన్, కుర్వ గోపాల్, సికిందర్, అంబదాస్, శివరాజ్, అబ్దుల్ రహీం పాల్గొన్నారు.

పూడూరులో..

పూడూరు: నియోజక వర్గంలోని ప్రతీ గ్రామపంచాయతీ అభివృద్ధే లక్ష్యంగా పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సురేందర్ పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని గొంగుపల్లి, దేవనోనిగూడ గ్రామాల్లో ఎమ్మెల్యే నిధులతో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ కార్యదర్శులు శ్రీనివాస్, అజీంపటేల్, నాయకులు రమేశ్, గోవర్ధన్, వెంకటేష్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

దౌల్తాబాద్‌లో..

దౌల్తాబాద్: మండల కేంద్రంలో బుధవారం ఉపాధి హామీ పథకం కింద మంజూరైన నిధులతో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ జిల్లా నాయకులు వెంకట్‌రెడ్డి, వీరన్న మాట్లాడుతూ ప్రతీ గ్రామంలోని ప్రతీ కాలనీలో సీఎం రేవంత్‌రెడ్డి కృషితో సీసీ రోడ్లు నిర్మిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మల్లేశ్, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

బొంరాస్‌పేటలో..

బొంరాస్‌పేట: నాగిరెడ్డిపల్లిలో బుధవారం సీసీ రోడ్డు పనులను జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ శేరి రాజేశ్‌రెడ్డి ప్రారంభించారు. రూ.5లక్షల నిధులతో గ్రామ సమీపంలోని పరమేశ్వర ఆలయం వద్ద జాతీయ రహదారి నుంచి సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేశారు. ఈ సందర్భంగా నాయకులను గ్రామస్తులు, ఆలయ కమిటీ సన్మానించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సింలుగౌడ్, కోస్గి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెంకట్రాములుగౌడ్, నాయకులు జయకృష్ణ, మల్లేశ్, రాంచంద్రారెడ్డి, పార్టీ గ్రామాధ్యక్షుడు నర్సింహా, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రక్షణ కల్పించాలని ఫిర్యాదు

కేశంపేట: ధర్మ సమాజ్ పార్టీ అధ్యక్షుడు విశారదన్‌తో పాటు అతడి అనుచరుల నుంచి తనకు ప్రమాదం ఉందని, రక్షణ కల్పించాలని మండల పరిధిలోని కాకునూర్ గ్రామానికి చెందిన సొంటె శ్రీనివాస్ శంషాబాద్ డీసీపీకి బుధవారం ఫిర్యాదు చేశారు. గతంలో డీఎస్పీలో విశారదన్‌తో కలిసి పార్టీలో పని చేసినట్టు ఆయన ఫిర్యాదులో తెలిపారు. ఆ సమయంలోనే విశారదన్ విధానపరమైన తప్పులను, ఉద్యమం మాటున అతను చేస్తున్న ఆర్థికపరమైన అవకతవకల విషయంలో ఇద్దరికి విబేధాలు వచ్చాయన్నారు. ఇటీవల కాలంలో కొన్ని మీడియా ఛానల్స్‌కు ఇంటర్వ్యూలు ఇస్తున్న సందర్భంలో విశారదన్‌కు సంబంధించిన అనేక విషయాలను ప్రజలకు తెలిపానన్నారు. దీంతో విశారదన్ తన అనుచరులతో తనపై భౌతికదాడులు చేస్తామని బంధువులు, స్నేహితులకు ఫోన్లు చేసి పరోక్షంగా బెదిరింపులకు పాల్పడుతున్నట్టు పేర్కొన్నారు. విశారదన్‌తో పాటు అతడి అనుచరుల నుంచి తనకు ప్రమాదం ఉందని రక్షణ కల్పించాలని ఆయన కోరారు.

సన్నబియ్యం సంక్షేమానికి చిహ్నం

గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ శేరి రాజేశ్‌రెడ్డి



బొంరాస్‌పేట: సన్నబియ్యం పథకాన్ని ప్రారంభిస్తున్న గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ శేరి రాజేశ్‌రెడ్డి

బొంరాస్‌పేట: రేషన్ షాపుల ద్వారా సీఎం రేవంత్ రెడ్డి అందిస్తున్న సన్నబియ్యం పంపిణీ ప్రజా సంక్షేమానికి చిహ్నమని గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ శేరి రాజేశ్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని పలు గ్రామాల్లో కాంగ్రెస్ శ్రేణులు, రెవెన్యూ సిబ్బంది పథకాన్ని ప్రారంభించారు. రెండో రోజు మండల కేంద్రంతోపాటు తుంకిమెట్ల, మెట్లకుంట, బురాన్‌పూర్, వడిచర్లలో ప్రారంభించారు. మండలంలోని అన్ని రేషన్ షాపుల్లో గురువారం పంపిణీ చేస్తామని తహసీల్దారు పద్మావతి, ఆర్ఐ శిరీష తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నర్సింలుగౌడ్, వెంకట్రాములుగౌడ్, జయకృష్ణ, మల్లేశ్, రాంచంద్రారెడ్డి, హనీఫ్ పాల్గొన్నారు.

దుద్యాల్‌లో..

దుద్యాల్: సామాన్యులకు సైతం సన్న బియ్యం అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతుందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్ రెడ్డి పేర్కొన్నారు. దుద్యాల్‌లో రేషన్ కార్డు కలిగిన వారికి సన్న బియ్యం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కిషన్, డీటీ వీరేశ్ బాబు, ఎంపీవో సత్యనారాయణ, కొడంగల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆకారం వేణుగోపాల్ పాల్గొన్నారు.

కొడంగల్‌లో..

కొడంగల్: కొడంగల్ మున్సిపల్‌లోని రేషన్ దుకాణాలతో పాటు మండల పరిధిలో అన్ని గ్రామాల్లో అధికారులు, ప్రజా ప్రతినిధులు సన్న బియ్యం పంపిణీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ విజయ్‌కుమార్, మాజీ ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్, మాజీ మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల కమిటీ అధ్యక్షుడు, నందారం ప్రశాంత్, పీఏసీఎస్ చైర్మన్ శివకుమార్ గుప్తా, మహ్మద్ యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ కార్డుదారులు సద్వినియోగం చేసుకోవాలి..



కొడంగల్ రూరల్: రుద్రారంలో ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి తదితరులు



మోమిన్‌పేటలో ప్రారంభిస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి

కొడంగల్ రూరల్: నిరుపేదలకు ప్రభుత్వం అందిస్తున్న సన్న బియ్యం పథకాన్ని రేషన్ కార్డుదారులు సద్వినియోగం చేసుకోవాలని మాజీ మున్సిపల్ చైర్మన్ ఆర్ జగదీశ్వర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నందారం ప్రశాంత్, తహసీల్దార్ విజయకుమార్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ కటుకం శివకుమార్‌గుప్తా, పీసీసీ సభ్యుడు మహ్మద్ యూసుఫ్, మార్కెట్ కమిటీ చైర్మన్ అంబయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ పేద కుటుంబానికి పంపిణీ..

మోమిన్‌పేట: ప్రతీ పేద కుటుంబానికి నాణ్యమైన సన్న బియ్యం పంపిణీ కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమని మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఉషారాణి డీలర్ దుకాణంలో సన్న బియ్యం పంపిణీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సురేశ్, ఎంపీడీఓ విజయలక్ష్మి, ఆర్ఐ గోవర్దన్, కార్యదర్శి స్వప్న, శుభాష్ గౌడు, సురేందర్, తదితరులు పాల్గొన్నారు.



కొడంగల్: సన్న బియ్యం ప్రారంభిస్తున్న ప్రజా ప్రతినిధులు